సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



ఇక 'ఆపరేషన్ ట్రేస్'

తప్పిపోయిన బాల బాలికలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ఆపరేషన్ ట్రేస్ ప్రారంభమైందని ఎస్పీ తెలిపారు. -8లో



చెలరేగుతున్న గ్యాంగులు

రాయచోటిలో అల్లరి మూకల గ్యాంగుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా బైకుల ర్యాలీలు, స్టంట్‌లతో ప్రజల భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.470
రెండోరకం	రూ.200	రూ.360



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 300 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీజీ	605	606
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 201.080 కిలోలు

న్యూస్‌రీల్

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

రాయచోటి టౌన్: రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీ ఎలక్ట్రికల్ (ఈఈఈ), ఎలక్ట్రానిక్స్ (ఈసీఈ) కోర్సుల కోసం స్పాట్ అడ్మిషన్ల నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా సంబంధిత సర్టిఫికెట్లతో రావాలని కోరారు.అభ్యర్థులు 10వ తరగతి మార్కుల మెమో, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సరిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్ లతో పాటు ఓసీ/ బీసీలు అయితే రూ.5800, ఎస్సీ, ఎస్టీలు అయితే 5500లు ఫీజు చెల్లించాలని సూచించారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కూడా ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9505504213/9000389029/ 98665 05119 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రెడ్డెమ్మతల్లికి కాసులహారం బహూకరణ



బంగారుకాసుల హారాన్ని అమ్మవారికి అలంకరించిన దృశ్యం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయానికి భక్తులు బంగారు కాసుల హారాన్ని బహూకరించారు. శనివారం రాజంపేటకు చెందిన రెడ్డివరప్రసాద్, ఆయన కుమారుడు మనోజ్‌కుమార్‌లు రూ. 2లక్షలు విలువ చేసే బంగారు కాసుల హారాన్ని అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా దాతలకు అర్చకులు, సిబ్బంది ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేయించారు. అమ్మవారి శేషవస్త్రంతో వారిని సత్కరించారు. అనంతరం దాతలు బంగారు కాసుల హారాన్ని ఆలయ ఈవో మంజులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఈవో ధన్యవాదాలు తెలియజేశారు.

ఏఐతో పల్లెల్లో ప్రగతి బాటలు



మాట్లాడుతున్న బుల్లా రాజేష్

కురబలకోట: గ్రామీణ ప్రాంతాల సాధికారిత కల్పనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) విప్లవాత్మక పాత్ర పోషిస్తోందని తిరుపతి శ్రీ సిటీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బుల్లా రాజేష్ అన్నారు. అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో గ్రామీణ సమాజాల సాధికారత కల్పనలో ఏఐ పరివర్తన పాత్రపై మూడు రోజుల పాటు జాతీయ సెమినార్ నిర్వహించారు. శనివారం ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, విద్య, మౌళిక సదుపాయాల అభివృద్ధి వరకు ఏఐ ఉపయోగాలు ఎంతగానో దోహదం చేస్తున్నాయన్నారు. స్మార్ట్ అగ్రికల్చర్‌తో పాటు గ్లోబల్ మార్కెటింగ్ రానుందన్నారు. పలమనేరు మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్, హెచ్ఓడీ డాక్టర్ ప్రభుకుమార్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ అంతరాన్ని ఏఐ తగ్గిస్తోందన్నారు.

స్కిల్‌డెవలప్‌మెంట్‌తో ఉపాధి అవకాశాలు



విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందచేస్తున్న ఎఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట: నేటి పోటీ ప్రపంచంలో స్కిల్ డెవలప్‌మెంట్‌తో ఉపాధి అవకాశాలు అధికంగా వస్తాయని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. అన్నమాచార్య పీజీ కాలేజీ ఆఫ్ కంప్యూటర్ స్టడీస్‌లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సీజీఆర్ జ్ఞానామృతధార స్కీం ద్వారా అడ్వాన్స్ ఏఐ ప్రోగ్రామింగ్ టూల్స్ అనే అంశానికి సంబంధించి సర్టిఫికెట్ కోర్సుపై ఉచితశిక్షణ ఇచ్చి, సరిఫికెట్స్‌ను అందచేసే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానం,మెలకవల గురించి తెలుసుకోవాల్సిన ఆవశకత్య ఉందన్నారు. కార్యక్రమంలో అన్నమాచార్య యూనివర్సిటీ వీసీ సాయిబాబారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ .డీజె సమతానాయుడు. ఎంబీఏ విభాగాధిపతి నవనీత,ఎంసీఏ .సీ.మదన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా కోర్సులో రాజంపేట ప్రభుత్వ డిగ్రీ విద్యార్థి షేక్ అస్మాత్ ప్రథమ బహుమతి, వైష్ణవీ డిగ్రీ కళాశాల విద్యార్థి షేక్.ఆశ్రీయ, ద్వితీయ బహుమతి, వెంకటసుధీర్ తృతీయ బహుమతి అందుకున్నారు.

పీజీ విద్య.. ఇక మిథ్య

వైద్య రంగం పట్ల కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. దీంతో ఇప్పటికే మంజూరైన కాలేజీలు కనుమరుగయ్యాయి. కేటాయించిన సీట్లు వెనక్కు వెళ్లాయి. ఇప్పుడు ప్రభుత్వ హోమియోపతి వైద్య రంగం కూడా అచేతనంగా మారింది. తాజాగా కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీకి పీజీ సీట్లను ఒక్కటి కూడా.. కేటాయించకపోవడంతో దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది.



- కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీపై శీతకన్ను
- పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు కేటాయించని కౌన్సిల్
- పట్టించుకోని పాలకులు



కడపలోని ప్రభుత్వ హోమియోపతి కాలేజీ

ప్రభుత్వ హోమియోపతి కాలేజీలకు పీజీ సీట్ల కేటాయింపుల వివరాలు

సంవత్సరం	2024		2025	
	యూజీ	పీజీ	యూజీ	పీజీ
కడప	38	08	38	-
గుడివాడ	50	24	50	12
రాజమండ్రి	60	24	50	-

కడప రూరల్: ప్రభుత్వ హోమియోపతి కాలేజీలు కడపతోపాటు గుడివాడ, రాజమండ్రిలో మాత్రమే ఉన్నాయి. పాలకుల నుంచి ఆలన..పాలన లేకపోవడంతో ఈ కాలేజీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా ఈ వైద్య రంగంలో విద్యను అభ్యసించే వారికి కష్టతరంగా మారింది.

'యూజీ'లకు తీవ్ర నష్టం

డాక్టర్‌గా సేవలు అందించాలనేది బైపీసీ విద్యార్థుల కల. నీట్ పరీక్షలు రాశాక, ర్యాంకులు, ఇతర నిబంధనల మేరకు ప్రాధాన్యత ప్రకారం వరస క్రమంలో మొదటగా ఎంబీబీఎస్ తరువాత బీడీఎస్ (డెంటల్), ఆయుర్వేదం, హోమియెపతి, యూనానిలో సీట్లను కేటాయిస్తారు. కాగా హోమియోపతికి సంబంధించి ప్రభుత్వ కాలేజీలో సీటు వచ్చిన వారు నాలుగున్నరేళ్ల పాటు యూజీ (అండర్ గ్రాడ్యుయేట్), ఒక ఏడాది హౌస్ సర్జన్‌గా చేయాలి. అనంతరం కీలకమైన పీజీ (పోస్టు గ్రాడ్యుయేట్) పూర్తి చేయాలి. ఇది మూడేళ్ల కోర్స్. ఈ కోర్స్‌ను పూర్తి చేసిన వారు మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీగా లేదా డిస్పెన్సరీల్లో మెడికల్ ఆఫీసర్‌గా చేయడానికి ఆస్కారం ఉంటుంది. పీజీకి అర్హత సాధించాలంటే ఇంకా కష్టపడి చదవాలి. కాగా కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీలో ఏటా 38 మంది విద్యార్థులు యూజీ చేయడానికి అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి వారు కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీకి ఒక్క పీజీ సీటును కూడా కేటాయించకపోవడం దారుణం. గుడివాడ కాలేజీకి మాత్రమే సీట్లను కేటాయించడం గమనార్హం. ఇప్పుడు కడప కాలేజీకి పీజీ సీట్లను కేటాయించకపోవడం వల్ల.. ఇకపై పీజీ సీట్లను కేటాయించరనే వాదన వినిపిస్తోంది. అదే గనుక జరిగితే యూజీ విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని.. ఈ రంగానికి చెందిన ప్రముఖులు అభిప్రాయ పడుతున్నారు.

పాలకుల నిర్లక్ష్య వైఖరే కారణం

కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య రంగం కకావికలమైంది. ఆ రంగానికి చెందిన అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పులివెందుల వంటి మెడికల్ కాలేజీ కనుమరుగైంది. కేటాయించిన సీట్లు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం జరిగింది. ఇప్పుడు అదే ఒరవడిలో హోమియోపతి వైద్య రంగం కూడా సమస్యలతో సతమతం అవుతోంది. పాలకపక్షం నుంచి కేంద్రంను 'మాకు మెడికల్ కాలేజీలు.. మెడికల్ సీట్లు కావాలి' అని అడిగే వారే కరువయ్యారు. దీంతో వైద్య రంగం పతనావస్థకు చేరిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కేటాయింపుల కోసం ప్రయత్నాలు

కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీకి పీజీ సీట్ల కేటాయింపుల అంశానికి సంబంధించి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయుష్ కమిషనర్ దినేష్‌కుమార్ చర్యలు చేపడుతున్నారు.

– డాక్టర్ శోభారాణి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్, ప్రభుత్వ హోమియోపతి కాలేజీ, కడప

ఇది 'కోతల సుఖీభవ'

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి: కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తోంది అన్నదాత సుఖీభవ కాదని, కోతల సుఖీభవ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారంరాయచోటిలో పత్రికలకు అందజేసిన ప్రకటనలో అన్నదాత సుఖీభవ నిధుల విడుదలపై స్పందించారు. రెక్కాడితే డొక్కాడని రైతులను మోసం చేయడం అన్యాయమన్నారు. చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో క్రమం తప్పకుండా అన్నదాత సుఖీభవ (రైతు భరోసా) కింద కేంద్రంతో సంబంధం లేకుండా రూ. 20 వేలను ఒకేసారి అందజేస్తామని చెప్పారన్నారు. గత ఏడాది 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ అయిపోతున్న తరుణంలో తూతూ మంత్రంగా నేడు రూ. 5 వేలను రైతుల ఖాతాలలో వేస్తూ ఆర్భాటం చేస్తున్నారన్నారు. అది కూడా గత జగన్ ప్రభుత్వంలో ఇస్తున్న లబ్ధిదారుల కంటే రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది రైతులకు తక్కువగా ఇస్తున్నారన్నారు. రైతులపై కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం గౌరవం, విలువ ఉన్నా వారు చెప్పిన మేరకు ఇప్పుడు ఇస్తున్న రూ. 5 వేలతోపాటు బాకీపడ్డ రూ. 35 వేలను వెంటనే వడ్డీతో సహా రైతుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

- ఎన్నికల ముందు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయానికి దన్నుగా ఉండేందుకు తన మేనిఫెస్టోలో పెట్టుబడి నిధి కింద 4 సంవత్సరాలకు ఏటా ప్రతి రైతుకు రూ. 12500లు చొప్పున రూ.50 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సంక్షేమం దృష్ట్యా రూ.12500ను, రూ.13500లు చేసి ఐదేళ్లపాటు అందించేందుకు నిర్ణయించి ఏటా రూ. 13500లు చొప్పున ఐదేళ్లకు రూ. 67500ను అందించి రైతులపై తన చిత్తశుద్ధిని వైఎస్ జగన్ చాటుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా రూ. 20వేలు ఇస్తామని చెప్పి ఒక ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి ఇప్పుడు రూ.5 వేలు ఇచ్చి రైతును మోసం చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. మామిడి రైతుల దగ్గర ఇన్సూరెన్స్ కట్టించుకున్నారే కానీ ప్రభుత్వం నుంచి ఒక్కరూపాయి కూడా రైతుకు పరిహారం ఇచ్చింది లేదన్నారు.
- విద్యార్థులను, ఆరోగ్యశ్రీని పూర్తి స్థాయిలో అందివ్వకుండా పేదలను, ఉద్యోగాలు, నిరుదోగ భృతి ఇవ్వకుండా నిరుద్యోగులను, ఆడబిడ్డ నిధి ద్వారా మహిళలకు నెలకు రూ. 1500లు అందిస్తామని చెప్పి ఇవ్వకుండా... అన్ని వర్గాలను చంద్రబాబు నాయుడు మోసం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఏ ప్రభుత్వమైనా రైతుల ఉసురు తగిలితే బాగుపడే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

కడప సెవెన్‌రోడ్స్: ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శనివారం రిటర్నింగ్ అధికారి సి.ఓబులమ్మ సమక్షంలో నిర్వహించారు. నామినేషన్లన్నీ సక్రమంగా ఉన్నట్లు ప్రకటించారు.

- ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లు దాఖలు చేసిన రాటాల రామయ్య, పూల విజయభాస్కర్, కోనేటి హరి వెంకటరమణ, వై.మధుమూర్తి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, టక్కోలి శివారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి అడ్డలూరు, కడప బాబుసాహెబ్, రేవిళ్ల బాలమునెయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, బొడ్డె వెంకట రమణ, అరిగేల సౌమిత్రి చంద్రనాథ్, గుండు మల్లికార్జునరెడ్డి, దున్నుతల రఘురామిరెడ్డి, వెంకటేశ్ నంద్యాల, ఈశ్వరయ్య తుమ్మలకుంట, వెంకట సుబ్బయ్య ఆలూరు, కుమారి శివరామకృష్ణారెడ్డి, నల్లగొండు వెంకట సుబ్బారెడ్డి, ఇరగంరెడ్డి శ్రీకర్‌రెడ్డి, నడివీధి సుధాకర్ నామినేషన్లు దాఖలు చేశారు.
- పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి తుమ్మల హేమంత్‌రెడ్డి, తుమ్మల ఉమాదేవి, మారెడ్డి జయభారత్‌రెడ్డి, అంకిరెడ్డి సురేష్‌కుమార్ రెడ్డి, మారెడ్డి లతారెడ్డి, భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, ముద్దిగారి వెంకగళరెడ్డి, మొయిళ్ల శివకల్యాణ్‌రెడ్డి, యాదటి సునీల్ యాదవ్, నాగేళ్ల సాంబశివారెడ్డి, తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డి, మరుజోల్ల గజేంద్రనాథ్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

చిన్నమండెం: ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. చిన్నమండెం మండల కేంద్రంలోని 2వ సచివాలయం వద్ద అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన ద్వారా రూ.6 వేలు కలిపి సంవత్సరానికి రూ.20 వేలు ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రసంగిస్తూ ఇది తక్కువ ఖర్చుతో కూడిన స్థిరమైన వ్యవసాయ విధానమని, ఇది భూమి ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలుగా ఉంటుందని వివరించారు. మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జేడీఏ శివనారాయణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) వెంకటమోహన్, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్‌నారాయణ, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

గండి క్షేత్రం.. పోటెత్తిన భక్తజనం

వైభవంగా రెండో శనివారోత్సవం

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి క్షేత్రం శనివారం భక్తజనంతో పోటెత్తింది. శ్రావణమాసం రెండో శనివారోత్సవం వైభవంగా జరిగింది. గత వారం కంటే ఈసారి భక్తులు సంఖ్య పెరిగిందని ఆలయ వర్గాల అంచనా. ఉదయం నుంచి క్యూలైన్లు మధ్యాహ్నం 3 గంటల వరకు కిక్కిరిశాయి. పలువురు భక్తులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించి తమ మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, అర్చకులు రఘు, సాయిలు ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. గండికి వచ్చిన కొందరు భక్తులు తలనీలాలు ఇచ్చి స్నాన ఘట్టాల వద్ద స్నానం చేసి స్వామిని దర్శనం చేసుకున్నారు. రెండవ శనివారం సుమారు 40 వేల మంది వరకు భక్తులు స్వామిని దర్శించుకొని ఉంటారని ఆలయ వర్గాల అంచనా. కొందరు భక్తులు కాలినడకన వచ్చి స్వామిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ అధికం కావడంతో పోలీసులు వాహనాలను కొద్ది సేపు గండిలోకి అనుమతించ లేదు. ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్సై రగారావు తమ సిబ్బందిచే బందోబస్తు నిర్వహించారు.



క్యూలైన్లలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో శ్రీవీరాంజనేయస్వామి

వాల్టా.. ఉల్టా

- నేలకొరుగుతున్న భారీ వృక్షాలు
- అక్రమంగా తమిళనాడుకు తరలిపోతున్న వృక్షసంపద
- పట్టించుకోని అధికారులు

గుర్రంకొండ: జిల్లాలో వాల్టాచట్టం అమలు జాడ ఎక్కడా కనిపించడం లేదు. కొంతమంది భారీ వృక్షాలను నేల కూల్చేస్తున్నారు. యథేచ్ఛగా తమిళనాడు రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. వాల్టా చట్టాన్ని పరిరక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వృక్ష సంపద రోజురోజుకు కనుమరుగైపోతోంది. ఓవైపు ప్రభుత్వం మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రచారం చేస్తున్నా మరోవైపు అక్రమార్కులు వృక్షాలను యథేచ్ఛగా నరికివేస్తూ వాటి ఉనికే లేకుండా చేస్తుండడం గమనార్హం.

యథేచ్ఛగా వృక్షాలు నరికివేత

ఎక్కడపడితే అక్కడ వృక్షాలు నరికివేస్తున్నారు. ఉన్న చెట్లను సంరక్షించడంలో అటవీశాఖ, రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. గ్రామాల్లో అన్ని రకాల చెట్లు, వనాలు ఎంతో పురాతనమైనవి ఉన్నాయి. శతాబ్దాల క్రితం నాటిన వృక్షాలపై. వ్యాపారులు దృష్టి సారిస్తున్నారు. పట్టా లున్న పొలాల్లో కాకుండా పోరంబోకు స్థలాల్లో ఉన్న చెట్లను కుడా అక్రమంగా నరికివేస్తున్నారు. ఇవి ఇంటి వస్తువులు తయారుచేసే కలపతో పాటు ఇటుకల బట్టీలు కాల్చడంలో వినియోగించుకొంటున్నారు. చివరకు దేవుడి మాన్యం, వంకపోరంబోకు, చెరువుపోరంబోకు స్థలాల్లోని పురాతన చెట్లను అక్రమార్కులు వదలడం లేదు. లక్షలాది రుపాయలు విలువ చేసే చెట్లను నరికివేసి సొమ్ము చేసుకొంటున్నారు.



నరికవేసిన వృక్షసంపదను లారీలోకి లోడ్ చేస్తున్న దృశ్యం



- జిల్లాలోని వ్యాపారులే కాకుండా తమిళనాడు రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడ కొచ్చి చింతచెట్లతో పాటు సంద్ర, ఇతర వృక్షసంపదను అక్రమంగా తరలించుకుపోతున్నారు. బయట రాష్ట్రాల నుంచి కూలీలు జిల్లాకు తరలివచ్చి గ్రామాల్లో మకాం వేసి రాత్రి పగలు తేడాలేకుండా చెట్లను నరికేసి రాత్రిళ్లు లారీల్లో బయట రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. వందలసంవత్సరాల వయస్సున్న చింతచెట్లు, వేపచెట్లు సైతం కోతకు గురై కుమరుగవుతున్నాయి. ఒక్కో చెట్టు సుమారు రూ:20వేల నుంచి రూ: 40వేల వరకు ధర పలుకుతోంది. ఇంటివస్తువుల తయారీకి ఉపయోగ పడే చెట్లు లక్షలాది రుపాయలు ధరలు పలుకుతున్నాయి. దీంతో స్థానిక వ్యాపారులు, తమిళనాడుకు రాష్ట్రానికి చెందిన వ్యాపారులు కుమ్ముక్కై ఇష్టానుసారం వృక్ష సంపదను ఇతర రాష్ట్రాలకు తరలించేస్తున్నారు.

చట్టపరంగా చర్యలు తీసుకొంటాం



చెట్లను అక్రమంగా నరికివేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా ఎవరైనా వ్యాపారులు చెట్లను నరికివేసి తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. చెట్లు నరికివేతపై ప్రజలు సమాచారం అందించి సహకరించాలి. వాల్టాచట్టం ఉల్లంఘించేవారిపై కేసులు నమోదు చేస్తాం. – సదాశివప్పనాయుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గుర్రంకొండ

అనుమతి తీసుకోవాలి

రెవెన్యూ అధికారులు చెట్లను నరికి వేయడానికి అనుమతి ఇచ్చినా వాటిని అటవీశాఖ అనుమతి లేనిదే బయట ప్రాంతాలకు తరలించకూడదు. ప్రతి వాహనం ఎక్కడి వెళుతుంది. వృక్షసంపద ఎక్కడికి, ఎందుకు తీసుకు వెళుతున్నారనే సమాచారం తమకు అందించి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. లేని పక్షంలో కేసులు నమోదు చేస్తాం. – రామ్మోహన్, ఫారెస్ట్‌బీట్ ఆఫీసర్, గుర్రంకొండ

వాల్టాచట్టం అమలు ఏది?



టి.రాచపల్లెలో అక్రమంగా నరికేసిన చెట్టు



ఎగువ హరిజనవాడలో వందల సంవత్సరాల వయస్సున్న చెట్టును కోసేసిన దృశ్యం

జిల్లాలో ఎక్కడా వాల్టా చట్టం అమలు కావడం లేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ చట్టం ప్రకారం చెట్లను నరికి వేయడానికి ముందుగా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వీటిని ఏ ప్రాంతానికైనా తరలించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రస్తుతం చెట్లను కోసేయడానికి ఎటువంటి అ. నుమతులు తీసుకోక పోవడం గమనార్హం. ప్రతిరోజు ఎక్కువ సంఖ్యలో లారీలు, ట్రాక్టర్ల ద్వారా వృక్షసంపద కొయ్యమిల్లులతో పాటు తమిళనాడు రాష్ట్రాలకు తరలి వెళుతోంది. ప్రతి ఒక్కరూ మొక్కలునాటి కాపాడాలని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా ఇక్కడ ఆమాటలు ఆచరణలో పెట్టకపోవడం గమనార్హం. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో వాల్టా చట్టం అవులు ప్రశ్నార్థకంగా మారింది.ప్రకృతి సహజసిద్ధమైన వనాలు, చెట్లను సంరక్షించాల్సిన అధికారులు వాటిని అక్రమంగా నరికి వేసి తరలించుకు పోతున్నా చోద్యం చూస్తూ కాలం వెల్లదీస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

హార్సిలీహిల్స్‌లో ముమ్మరంగా తనిఖీలు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను శనివారం సాయంత్రం పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కొండపై ఇప్పటి దాకా పోలీసుల తనిఖీలు లేకపోవడటంతో బైక్‌లపై విన్యాసాలు, బహిరంగంగా మద్యం తాగడం, వచ్చే పర్యాటకులకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉండటం లేదు. దీనిపై స్పందించిన మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో స్థానిక సీఐ జీవన్ గంగనాథ్‌బాబు, మదనపల్లె తాలూకా సీఐ సత్యనారాయణ, ముదివేడు, ములకలచెరువు, మదనపల్లె రూరల్, పెద్దతిప్పసముద్రం ఎస్ఐలు దిలీప్‌కుమార్, రామచంద్ర, చంద్రమోహన్, హరిహర ప్రసాద్‌లు, 50 మంది కానిస్టేబుళ్లతో తనిఖీలు నిర్వహించారు. ఘాట్‌రోడ్డుపై వస్తున్న బైక్‌లను తనిఖీ చేసి లైసెన్సులు ఉన్నాయా లేదా, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు బైక్‌లు నడపడం లాంటి వాటిపై చర్యలు తీసుకున్నారు. ఘాట్‌రోడ్డు ప్రయాణంలో సాహస విన్యాసాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని బైకర్లను హెచ్చరించారు. కొండపై ఉన్న అతిథి గృహాల నిర్వాహకులతో మాట్లాడారు. అతిథి గృహాల్లో విడిదిచేసే పర్యాటకులు ఎక్కడినుంచి వచ్చారో వారి వివరాలు, చిరుమానాలు సేకరించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగినా తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ మహేంద్ర, సీఐ జీవన్ గంగానాథ్‌బాబు నిర్వాహకులను, టూరిజం సిబ్బందిని కోరారు. అనంతరం గాలిబండ అంచులోకి వెళ్తున్న పర్యాటకులను ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.



టూరిజం రిసెప్షన్‌లో పర్యాటకుల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐ

క్లుప్తంగా

భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు

వీరబల్లి : మండలంలోని సంఘంవాండ్లపల్లెకు చెందిన జుట్టు చెండ్రాయుడు అనే వ్యక్తి కనబడలేదంటూ అతని భార్య స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం గొర్రెల వ్యాపారం నిమిత్తం వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త శుక్రవారం తనకు ఫోన్ చేసి రాజంపేటకు వెళ్తున్నానని చెప్పి ఫోన్ కట్ చేసినట్లు తెలిపారు. మూడు రోజులు గడుస్తున్నా ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ యార్డులో హమాలీపై దాడి


దాడిలో గాయపడిన బావాజాన్

మదనపల్లె రూరల్ : పట్టణంలోని నీరుగట్టువారిపల్లె టమాటా మార్కెట్ యార్డులో హమాలీపై మందు బాబులు దాడి చేసిన ఘటన శనివారం జరిగింది. నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు ఏబీ టమాటా మండీలో బావాజాన్(48) హమాలీగా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు పూటుగా మద్యం సేవించి దారి విషయమై బావాజాన్‌తో గొడవపడి రాళ్లతో దాడిచేసి కొట్టారు. దాడిలో గాయపడిన బాధితుడిని స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె రూరల్ : అత్తింటి వేధింపులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. కర్నాటక ముళబాగల్ ముత్యాలపేటకు చెందిన నాగరాజ, సుగుణ కుమార్తె జ్ఞానగిరి శిరీషాను మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ పందివారిపల్లెకు చెందిన దామోదర్‌కు ఇచ్చి 2017లో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నిరోజులుగా అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తుండగా, వారి వేధింపులు భరించలేక రెండునెలల క్రితం శిరీషా పుట్టింటికి వెళ్లిపోయింది. అత్తింటిలో వేధింపులపై శనివారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు భర్త దామోదర్, అత్త చంద్రమ్మ, మామ వెంకటరమణలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై టీడీపీ నేత లైంగిక వేధింపులు

పీలేరు రూరల్ : ఫీల్డ్ అసిస్టెంట్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన టీడీపీ నాయకుడిపై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముడుపులవేముల పంచాయతీ దళితవాడకు చెందిన పల్లెపాగు రెడ్డికాంత భర్త 2024 జూలై 24న అనుమానాస్పద స్థితిలోమృతి చెందాడు. ఆమె గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అదే పంచాయతీ తాణావడ్డిపల్లెకు చెందిన యల్లమంద శ్రీనివాసులు ఏడాది కాలంగా రెడ్డికాంతను మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. అతని వేధింపులు తాళలేక శనివారం సీఐ యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇక 'ఆపరేషన్ ట్రేస్'!

- తప్పిపోయిన మహిళలు, బాలికల ఆచూకీ కోసం పోలీసు శాఖ ప్రత్యేక కార్యక్రమం
- జిల్లాలో 37కు పైగా మిస్సింగ్ కేసులు
- వారంలోగా ఛేదించాలన్న జిల్లా ఎస్పీ


వి.విద్యాసాగర్ నాయుడు, జిల్లా ఎస్పీ

రాయచోటి : జిల్లాలో తప్పిపోయిన బాల బాలికలను గుర్తించి వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఉద్దేశించిన ప్రత్యేక కార్యక్రమం ఆపరేషన్ ట్రేస్ జిల్లాలో ప్రారంభమైందని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు తెలిపారు. శనివారం రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమం నిర్వహణపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీవింగ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ రూపంలో అమలు చేయాలని సూచించారు. బాలికల అపహరణలు, తప్పిపోవడాలను పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఆగస్టు 1వ తేది నుండి 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపడుతున్నట్లు ఎస్పీ వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 30 నుంచి 37 మిస్సింగ్ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ కేసులలో ఐదు మంది చిన్నారులు కూడా కనిపించకుండా పోయినట్లు సమాచారం ఉందన్నారు. జిల్లాలోని పోలీసు యంత్రాంగం పూర్తి సమన్వయంతో ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమంలో పాల్గొంటుందన్నారు. కుటుంబాల నుండి దూరమైన బాలికలను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించి తిరిగి వారి కుటుంబాల వద్దకు చేర్చడమే ఆపరేషన్ ట్రేస్ లక్ష్యమని ఎస్పీ అభిప్రాయపడ్డారు.

ఆపరేషన్ ట్రేస్..

ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమానికి సంబంధించి ఆగస్టు నెల 1, 2వ తేదిలలో డేటా కలెక్షన్ కోసం సబ్ డివిజన్ స్థాయిలో టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు నెలలో 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఎన్జీఓలు, ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న షెల్టర్స్ తనిఖీ చేస్తారన్నారు. సంబంధిత ఎఫ్ఐఆర్‌లను రీ వెరిఫికేషన్ చేయడం, అందులో భాగంగా టెక్నాలజీని ఉపయోగించడం మొదటి ప్రాధాన్యతగా చేపడతామన్నారు. ఫేస్ రికగ్నైజేషన్, డీఎన్ఏ టెస్టు, ఆధార్ ద్వారా వయస్సుకు సంబంధించిన సమాచారం సేకరిస్తామన్నారు. రెండో విచారణలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు, ప్రార్థనా స్థలాలు, రెడ్ లైట్ ఏరియాలలో ప్రత్యేక తనిఖీల ద్వారా తప్పిపోయిన బాలికలను గుర్తించే చర్యలు ఉంటాయన్నారు. శక్తి యాప్‌లో రిపోర్టు మిస్సింగ్ చిల్డ్రన్ అనే ఫీచర్ ద్వారా తప్పిపోయిన పిల్లల కోసం ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆపద సమయంలో సహాయం కోసం ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే పోలీసులు తక్షణమే స్పందించి సహాయం చేస్తారని తెలిపారు. తప్పిపోయిన పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని 112 నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా లైదా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు. 1098కు, ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర. 181కు, శక్తి వాట్సప్ నెంబర్ 7993485111కు సమాచారం ఇవ్వడం ద్వారా సహాయం పొందగలరన్నారు.

డివిజన్ పరిధిలో....

జిల్లాలో ప్రతి సబ్ డివిజన్ పరిధిలో మహిళల రక్షణ కోసం శక్తి టీమ్‌లు పనిచేస్తున్నాయన్నారు. ఈ టీమ్‌లు బహిరంగ ప్రదేశాలలో ఈవ్ టీజింగ్ చేసే ఆకతాయిల భరతం పడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒన్ స్టాప్ సెంటర్‌లు బాధిత మహిళలకు, బాలికలకు అన్ని విధాలుగా సహాయం చేస్తాయని తెలిపారు. జిల్లాలోని ప్రతి స్కూల్‌లో క్లాస్ రూమ్ నుండి ఐదుగురు బాలికలను శక్తి వారియర్స్ గ్రూప్‌గా ఏర్పాటు చేసి వారికి శక్తి టీమ్ ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లు గురించి క్రిందిస్థాయి అధికారులు వివరించారన్నారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి బాలికలకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమాలలో తప్పిపోయిన బాలికలకోసం పోలీసులతోపాటు, ఎన్‌జీఓలు, ప్రజా సంఘాలు పాల్గొని సహకారం అందించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని మొట్టమొదటి ప్రాధాన్యతగా ఆపరేషన్ ట్రేస్‌ను పోలీసు స్టేషన్ల ద్వారా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. బాలికలను అక్రమ రవాణా చేసే ముఠాల నుంచి రక్షించి వారి భవిష్యత్తును సురక్షితంగా ఉంచడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు.

నాన్ బెయిలబుల్ నిందితులు అరెస్టు..

జిల్లాలో నాన్ బెయిలబుల్ వారెంట్లు కలిగి తప్పించుకు తిరుగుతున్న నిందితులపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులను అప్రమత్తం చేసి ప్రత్యేక డ్రైవ్ ద్వారా 150కిపైగా నాన్ బెయిలబుల్ వారెంటుదారులను అరెస్టు చేసి కోర్టులో లొంగిపోయే విధంగా చేశామన్నారు. ఇందులో పాలుపంచుకున్న పోలీసు అధికారులను ఎస్పీ అభినందించి ప్రోత్సహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పాల్గొన్నారు.

హమాలీ కుటుంబానికి రూ.2లక్షల ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్.ఏ.మస్తాన్, సభ్యులు

మదనపల్లె రూరల్ : టమాటా మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తూ, ప్రమాదవశాత్తు లారీ కిందపడి మృతి చెందిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన హమాలీ కుటుంబానికి మదనపల్లె టమాటా మార్కెట్‌యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్.ఏ.మస్తాన్, రూ.2లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్ కాశీగంజ్‌జిల్లా నంగులాతానాకు చెందిన మోర్‌సింగ్(48) ఐదేళ్లగా నీరుగట్టువారిపల్లెలో నివాసం ఉంటూ స్థానికంగా టమాటా మార్కెట్‌లో హమాలీగా పని చేసేవాడన్నారు. జూలై 24వ తేదీ రాత్రి జరిగిన ప్రమాదంలో లారీ చక్రాల కిందపడి మోర్ సింగ్ ఘటనాస్థలంలోనే మృతి చెందాడన్నారు. యూనియన్ సభ్యులంతా కలిసి ఏకగ్రీవంగా తీర్మానించుకుని మృతుని కుటుంబ సభ్యులకు రూ.2లక్షల ఆర్థికసహాయం అందించాలని నిర్ణయించుకున్నామన్నారు. హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రామయ్య, ఉపాధ్యక్షుడు రసూల్, కార్యదర్శి మహబూబ్‌బాషా, మురాషా, చలపతి, షామీర్, సుధాకర్, బావాజాన్, సుబ్బు, రోషన్, శివ, జాఫర్, కుర్షిద్, అరవింద్, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన మునస్వామి శెట్టి

రామసముద్రం : కర్నాటక రాష్ట్రం పెగలపల్లెకు చెందిన మునస్వామిశెట్టి(45) మండలంలోని గౌతిమ్మరాయస్వామి ఆలయ దర్శనానికి వచ్చి తిరుగుప్రయాణంలో గాంధీనగర్ వద్ద గుంతను తప్పించబోయి ద్విచక్రవాహనం బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి బాధితుడిని పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రీ కొడుకుల గొడవలో చేనేత కార్మికుడికి గాయాలు


గాయపడిన చేనేత కార్మికుడు ఇంతియాజ్ అహ్మద్

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో తండ్రీ కొడుకులు దారిలో గొడవపడుతూ ఇనుప వస్తువులు ఒకరిపై ఒకరు విసురుకుంటుండగా, అటుగా వెళుతున్న ఓ చేనేత కార్మికుడిపై పడటంతో తీవ్రంగా గాయపడి కాలు విరిగిన ఘటన శనివారం సాయంత్రం మదనపల్లె పట్టణంలో జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన ఇంతియాజ్ అహ్మద్(55) పదిరోజుల క్రితం బతుకుదెరువులో భాగంగా మదనపల్లెకు వచ్చాడు. నీరుగట్టువారిపల్లెలో మగ్గం కార్మికుడిగా పనిచేసుకుంటున్నాడు. శనివారం సాయంత్రం పనులు చేస్తూ విరామం కోసం మగ్గం గుంతలో నుంచి లేచి బజారులోకి వచ్చాడు. అదే సమయానికి పక్కింటికి చెందిన రామచంద్ర అతడి కుమారుడు లోకేష్ కుటుంబ సమస్యలతో గొడవపడుతూ ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లు, ఇనుపవస్తువులు విసురుకుంటున్నారు. రామచంద్ర విసిరిన ఇనుప వస్తువు వేగంగా వచ్చి ఇంతియాజ్ అహ్మద్ కాలుకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

లారీ, ఆటో ఢీ : ఒకరి మృతి


ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీదేవి

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయరహదారిలోని బోయనపల్లె వద్ద శనివారం లారీ–ఆటో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో మున్సిపాలిటి పరిధిలోని రామ్‌నగర్‌కు చెందిన నాగారం లక్ష్మీదేవి(46) అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా..శేషమాంబపురం ఆటోడ్రైవర్ కొరముట్ల సాంబయ్య ఆటో(ఏపీ49డబ్ల్యుఈ7482)లో మృతురాలితోపాటు నాగారం దివ్య, ఓబులవారిపల్లెకు చెందిన తోట గగన్, తోట మౌనిక, తోట వెంకటరమణ నందలూరులోని సౌమ్యనాథస్వామిని దర్శించుకున్న అనంతరం తిరిగి రాజంపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి నుంచి కడప వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీ కొంది. దీంతో హైవేలో ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108లో రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలోని ఆయా మండలాలకు మండల పార్టీ కమిటీలను నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

రాయచోటి మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా కె.తిరుపాల్‌నాయుడు, ఆర్.హరినాథరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎం.వెంకట్రామిరెడ్డి, బి.నాగార్జునరెడ్డి, పి.ఆంజనేయులు, కార్యదర్శులుగా ఎస్.రామ్మోహన్‌రెడ్డి, డి.బయన్న, టి.గంగిరెడ్డి, వి.రమణయ్య, ఎస్‌కే జిలాన్‌తోపాటు 9 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు.

బి.కొత్తకోట నగర పంచాయతీ పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా సోము, బి.సురేష్, ప్రధాన కార్యదర్శులుగా ఎన్.నవీన్, మోహన్, జనార్దన్, ఆదాం, కార్యదర్శులుగా సి.గౌతమ్‌రెడ్డి, డి.చలపతి, బి.నవీన్, కె.జయచంద్ర, ఎస్.కలీంలతోపాటు 9 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు.

బళ్లారి రాఘవ జయంతి వేడుకలు

రాయచోటి టౌన్ : నాటకరంగ పితామహుడు బళ్లారి రాఘవ జయంతి వేడుకలు అన్నమయ్య జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఎస్పీ విద్యాసాగర్ నాయుడు బళ్లారి రాఘవ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బళ్లారి రాఘవ తెలుగు నాటక రంగానికి ప్రాణం పోశారన్నారు. ఆయన కళల ద్వారా సమాజంలో నెలకొన్న దురాచారాలను ప్రశ్నించి సమాజంలో మార్పు తీసుకురావడానికి విశేష కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ యం.వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ యం. శ్రీనివాసులు, ఆర్ఐలు వీజే రామకృష్ణ, యం.పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంగమాంబ వర్ధంతి

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన తరిగొండ మాతృశ్రీ వెంగమాంబ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి కల్యాణోత్సవం కనులపండువగా జరిపారు. ఆలయంలో అమ్మవారిని రంగురంగు పుష్పాలతో అలంకరించారు. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న ఓబిలి గ్రామస్తులు


ఓబిలి వద్ద ఇసుక టిప్పర్లను అడ్డుకున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని చెయ్యేరు నది ఆనుకొని ఉన్న ఓబిలి గ్రామం నుండి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా గ్రామస్తులు, సీపీఐ నాయకులు శనివారం అడ్డుకున్నారు. నందలూరు మండలంలోని టంగుటూరు రీచ్ వద్ద ఇసుకను భారీ టిప్పర్లు లోడ్ చేసుకొని ఓబిలి గ్రామం ద్వారా వెళ్లడంతో గ్రామంలోని సిమెంటు రోడ్లు పాడవడంతో పాటు దుమ్ము విపరీతంగా వస్తుండటంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న సీపీఐ నాయకులు గ్రామస్తులకు అండగా నిలవడంతో ఇసుక టిప్పర్లను అడ్డుకున్నారు. టిప్పర్లు విపరీతంగా వెళ్లడంతో పాఠశాలలకు వెళ్లే చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

బొప్పాయికి కిలోకు రూ. 16 చెల్లించాలి

చిట్వేలి : బొప్పాయి పంటకు కిలోకు రూ. 16లు గిట్టుబాటు ధర చెల్లించాలని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంట ప్రారంభంలో టన్ను రూ. 16 వేలు, రూ. 17 వేలు పలికిన బొప్పాయి ధర క్రమేణా తగ్గుతూ టన్ను రూ. 7 వేలు చేశారన్నారు. కిలో బొప్పాయికి రూ. 16 చెల్లించాలని, దళారి వ్యవస్థను రద్దు చేయాలని, టన్నుకు వం దకిలోల తరుగు తీయడాన్ని ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం అన్నమయ్య జిల్లా కార్యదర్శి రామచంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు హరి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ఏపీఎండీసీ కన్వీనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భర్త మద్యం మానలేదని ఆత్మహత్య


లక్ష్మీదేవి (ఫైల్)

బి.కొత్తకోట : మద్యానికి బానిసైన భర్త.. భార్య, బిడ్డలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం, ఎన్నిసార్లు వేడుకున్నా మద్యం మానకపోవడంతో ఆవేదనకు గురైన భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బి.కొత్తకోట మండలం పులుసుమానిపెంటలో జరిగింది. గతనెల 31న గురువారం రాత్రి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మొటుకుపల్లె పంచాయతీ బద్దిపల్లెకు చెందిన ఎం.లక్ష్మిదేవి (35)కి, ఇదే పంచాయతీ పులుసుమానిపెంటకు చెందిన శివశంకర (35)తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి జగదీష్ (13), రజిత (11) సంతానం. శివశంకర్ మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. అయితే మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై భార్య లక్ష్మీదేవి, ఆమె తండ్రి వీరమల్లు పలుమార్లు మద్యం మానుకొని కుటుంబాన్ని చూసుకోవాలని శివశంకర్‌ను ప్రాధేయపడ్డారు. అయినప్పటికి శివశంకర్ పెడచెవినపెట్టాడు. భార్య ఈ విషయమై కుటుంబం ఇబ్బందుల్లో పడుతుందని, పిల్లల భవిష్యత్తు చూడాలని ప్రాధేయపడేది. ఎవరి మాట వినని భర్తను ఇక భరించలేనన్న నిర్ణయానికి వచ్చిన లక్ష్మిదేవి గురువారం రాత్రి ఇంటిలో విష ద్రావణం తాగింది. గమనించిన స్థానికులు భర్త, తండ్రికి విషయం తెలపడంతో వారు చికిత్స కోసం కర్ణాటకలోని రాయల్పాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రికి తరలించాలని సూచించగా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. దీనిపై మృతురాలి తండ్రి వీరమల్లు ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ రామాంజులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోని తండ్రి కారణంగా ఇద్దరు చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన మురళీ


విద్యార్థి రాంచరణ్

మదనపల్లె రూరల్ : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్ట వైఎస్సార్ కాలనీకి చెందిన నరసింహులు కుమారుడు మురళీ(50) శనివారం వ్యక్తిగత పనులపై స్వగ్రామమైన కలకడ మండలం గుడిబండకు వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా, కురబలకోట మండలం ముదివేడు సమీపంలోని అడవిలోపల్లె క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన బొలేరో ఢీకొంది. ప్రమాదంలో మురళీ తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యులు చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుడిని రెఫర్ చేశారు. అయితే బాధితుడి వెంట వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు రెఫర్ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో సరైన చికిత్స అందించకుండానే వచ్చిన ప్రతి కేసు రెఫర్ చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థికి తీవ్ర గాయాలు..

ద్విచక్రవాహనం ఢీకొని విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం పుంగనూరు మండలంలో జరిగింది. భీమగానిపల్లెకు చెందిన విద్యార్థి రాంచరణ్ (16) స్కూల్ వదిలిన వెంటనే మధ్యాహ్న భోజనం కోసం మోదుగులపల్లె కట్ట వద్ద వెళుతుండగా, ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం విద్యార్థిని ఢీకొంది. ప్రమాదంలో రాంచరణ్ తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఆయా ప్రమాద ఘటనలపై సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రాయచోటిలో చెలరేగుతున్న గ్యాంగులు

- ప్రేక్షక పాత్రలో పోలీసులు
- అర్ధరాత్రి వేళ ఆర్టీసీ ఇంద్ర బస్సుపై దాడి.. పగిలిన అద్దాలు



పగిలిన ఇంద్ర బస్సు అద్దాలు, గాయపడిన యువకుడు

రాయచోటి : రాయచోటిలో అల్లరి మూకల గ్యాంగుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా దాడులు, ప్రతి దాడులు, బైకుల ర్యాలీలు, స్టంట్‌లతో పట్టణ ప్రజలను, వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. విచ్చలవిడిగా గ్యాంగుల దాడులతో ఎక్కడ ఏమి జరుగుతుందోన్న భయం పట్టణ ప్రజల్లో నెలకొంది. విచ్చలవిడిగా రెచ్చిపోతున్న గ్యాంగులను అదుపుచేయడంలో రాయచోటి పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ప్రతిరోజూ రెండు, మూడు ప్రాంతాల్లో గ్యాంగుల దాడులతో గాయాల పాలైన మూగ రోదనలతో ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. దాడులలో గాయపడిన వారు పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కినా గ్యాంగులకు రాజకీయ నాయకుల అండదండలు లభిస్తుండటంతో వారిపై కేసులు నమోదు చేసే సాహసాన్ని పోలీసులు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆర్టీసీ ఇంద్ర బస్సుపై దాడి.

రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇంద్ర ఆర్టీసీ బస్సుపై పట్టణంలోని ఒక గ్యాంగ్ రాళ్లతో దాడికి తెగబడింది. నేతాజీ సర్కిల్ నడిరోడ్డుపై బైకులు ఆపి రోడ్డుపై వెళ్తున్న వాహనదారులపై గ్యాంగ్ నాయకులు వీరంగం సృష్టించారు. ఇదే సమయంలో కడప నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఇంద్ర ఏపీ04జెడ్0397 నెంబరుగల ఆర్టీసీ బస్సు 12 గంటల అనంతరం రాయచోటిలోని నేతాజీ సర్కిల్‌కు చేరుకుంది. రోడ్డుపై అడ్డంగా ఉన్న బైకులను తొలగించాలని డ్రైవర్ కోరినా పీకలతోతు మద్యం తాగిన గ్యాంగ్ సభ్యులు ఆర్టీసీ డ్రైవర్‌పై తిరగబడ్డారు. ఈ బస్సు వెనుకవైపు వచ్చిన బద్వేల్ ఆర్టీసీ బస్సును కూడా యువకులు అడ్డగించి అసభ్య పదజాలంతో డ్రైవర్‌ను దూషించారు. వారితో వాదనలను పెట్టుకోకుండా ఇంద్ర బస్సు డ్రైవర్ బస్సును చాకచక్యంగా ముందుకు నడిపి వెళ్తున్న సమయంలో గ్యాంగ్ సభ్యులు ఆ బస్సును వెంటపడి చిత్తూరు–మదనపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని శివాలయం వద్దకు చేరుకోగానే బండరాళ్లతో బస్సుపై దాడి చేశారు. రాళ్లదాడిలో ఇంద్ర బస్సు వెనుక అద్దాలు పగిలిపోయాయి. అయితే ఈ బస్సులో వెనుక భాగాన ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. జరిగిన సంఘటనపై డ్రైవర్ జేసీ సుబ్బారావు రాయచోటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు రాయచోటి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కోర్టు కాంప్లెక్స్‌ను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి


రాజంపేట కోర్టు క్లాంపెక్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

రాజంపేట : స్థానిక కోర్టు క్లాంపెక్స్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని శనివారం పరిశీలించారు. కోర్టు క్లాంపెక్స్ ఒప్పందంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం అప్పగించలేదని రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చా హనుమంతు నాయుడు అభ్యర్థన మేరకు జిల్లా ప్రధానన్యాయమూర్తి రాజంపేట కోర్టుకు విచ్చేశారు. కోర్టు భవనాలు, తహసీల్దార్ కార్యాలయ భవనాలను ఆమె పరిశీలించారు. బార్ అసోసియేషన్ న్యాయవాదుల సమావేశంలో పాల్గొన్నారు. న్యాయవాదుల నుంచి కోర్టు పరమైన సమస్యలపై వినతులను అందుకున్నారు. కార్యక్రమంలో 3వ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాశ్, హైకోర్టు న్యాయవాది కొండూరు శరత్‌కుమార్ రాజు, రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చా హనుమంతునాయుడు, తహసీల్దార్ పీరుమున్నీ, ఏజీపీ మౌనిక, సీనియర్ న్యాయవాదులు రవీంద్ర, రామచంద్ర, బి.నాగరాజగుప్తా, పి.సురేష్‌కుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి


ఏఓ నాగభూషణంకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రాయచోటి : ప్రభుత్వ బడులలో పనిచేసే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని, బోధనను హరించే యాప్‌లను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా రద్దు చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో నాయకుడు ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి పెండింగ్ డీఏలను చెల్లించాలన్నారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జాబిర్ మాట్లాడుతూ పి–4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయరాదన్నారు. ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ గఫార్ ఖాన్ మాట్లాడుతూ నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు ఎం.రెడ్డన్న, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా కో–చైర్మన్‌లు శివారెడ్డి, ఇలియాస్, హరి ప్రసాద్, జిల్లా కోశాధికారి జఫరుద్దీన్, బీలు నాయక్, ఫ్యాప్టో రాష్ట్ర బాధ్యులు రవీంద్రారెడ్డి, రామచంద్ర, డీసీబీబీ సెక్రటరీ నాగముని రెడ్డి, ఫ్యాప్టో నాయకులు సుధాకర్ నాయుడు, ఎస్.శివారెడ్డి, బి.చంద్రశేఖర్, రెడ్డప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయం ఏఓ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

KENNELS

Sharmila Kennels. అన్ని రకాల మేలు జాతి కుక్క పిల్లలు జర్మన్ షెపర్డ్, రాట్ విల్లర్ మొ॥ అమ్మబడును. అన్ని జాతి కుక్కలకు ట్రైనింగ్ ఇవ్వబడును. సంప్రదించండి సెల్: 9133763354.

HEALTH CARE

NEUROLOGIST

డా॥M.సుధాకర్‌రావు, M.D (Gold Medalist) D.M. (Neurology) అన్ని రకముల మెదడు, వెన్నుపూస,నరముల జబ్బులు చూడబడును, సుధాకర్ న్యూరో క్యూర్, రెడ్డి & రెడ్డి కాలని, వెంకటరమణ హాస్పిటల్ ప్రక్కన,తిరుపతి, 0877-2250600,9949916060.

CHANGE OF NAME

I, THUMMALA RAJAIAH (OLD NAME), R/O. POLI APPARAJUPETA (V), (P), RAJAMPET (M), ANNAMAYYA (DT), A.P., HEREBY CHANGED MY NAME AS THUMMALAPALLI RAJAIAH (NEW NAME), S/O. THUMMALAPALLI GANGAIAH.

WANTED

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959031122, 9676901122

బిస్సల్లెస్ కాదు.VIPఇండ్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు.ఫ్రీరూమ్+భోజనం.Hyd.9666253675.

Aquaguard, Orient, crompton మొదలగు MNC కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ (డిగ్రీ or MBA), సర్వీస్ టెక్నీషియన్ (ITI) కావలెను. ఉచిత శిక్షణ సంప్రదించవలసిన ఫోన్ నెం : 8008274426

అగ్రికల్చర్ షోరూం నందు పని చేయుటకు అకౌంటెంట్, సేల్స్‌మెన్, మెకానిక్, డ్రైవర్, వెల్డర్ కావలెను. Ph: 9966869990

హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పని చేయుటకు నర్సులు, కేర్ టేకర్లు, ఆడ/మగ/జంట కావలెను. ఫోన్: 9347556162 / 8309615249

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక